పింఛన్ తపన ప్రాణం తీసింది

ఆర్థిక ఆసరా లేక అన్నపూర్ణ మృతి

విశాలాంధ్ర - సాలూరు: మండలంలో కూర్మరాజుపేటకు చెందిన గిరిజన వృద్ధురాలు వంజరపు అన్నపూర్ణ (62) బుధవారం మృతి చెందింది. ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ కోసం ఎదురుచూస్తూ ఉండేదని ఫించన్ మంజూరు కాకపోవడంతో దిగులుచెంది మృతి చెందినట్లు గ్రామస్తులు తెలియజేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అన్నపూర్ణ భర్త కన్నయ్యలు నిరుపేద గిరిజనులు. వీరికి సంతానం లేకపోవడంతో బంధువుల బిడ్డను చేరదీశారు. వలస కూలీగా దూరప్రాంతాలలో పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా 2023లో కన్నయ్య అనారోగ్య కారణాలతో మరణించాడు. వృద్ధాప్య కోటాలో పింఛన్ అందుకుంటున్న కన్నయ్య మృతిచెందడంతో అన్నపూర్ణకు ఆర్థిక ఆసరా లేకుండా పోయింది. నిబంధనల ప్రకారం సంబంధిత పింఛన్‌ను వితంతువు కోటాలో అన్నపూర్ణకు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఇవ్వాల్సి ఉంది. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అధికారుల జాప్యంతో నేటికీ పింఛన్ డబ్బులకు నోచుకోలేకపోయింది. దీంతో ఆర్థిక ఆసరాకు దూరమైంది. పింఛన్ రాకపోవడంతో ఆర్థిక ఆసరాలేక తినడానికి తిండిలేక అన్నపూర్ణ మరణించినట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. పింఛన్ అంది ఉంటే మరి కొన్నాళ్లు బ్రతికి ఉండేదని వారంతా తెలిపారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పింఛన్ మంజూరు కాకపోవడానికి గల కారణాలను అధికారులు పరిశీలించి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఎంఈఓ సార్ ఎక్కడ...?

సొంత పనులపైనే దృష్టి

పాఠశాలలను పర్యవేక్షించని వైనం

విశాలాంధ్ర - కొమరాడ: కనీసం రెండు మూడు నెలలు గడుస్తున్నా మండల విద్యాశాఖ అధికారి సమావేశాలకు తప్ప మండలంలో ఏ ఒక్క పాఠశాల పరిశీలనకు గాని వచ్చిన దాఖలాలు లేవు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకున్న పాపానపోలేదు. మండల విద్యాశాఖ అధికారి కే.నారాయణస్వామి సుమారు 10 నుండి 12 సంవత్సరాల నుంచి ఒకే మండలంలో ఉండిపోయారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి మండల విద్యాశాఖ అధికారికి రాబోవు విద్యా సంవత్సరంలో బదిలీ చేయాలని పలువురు కోరుకుంటున్నారు. మండల విద్యాశాఖ అధికారులు ఇద్దరు ఉన్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడం విడ్డూరం. మండల విద్యాశాఖ అధికారి సొంత పనులపైనే దృష్టిపెడుతుంటారు తప్ప విధి నిర్వహణలో ఏమాత్రం దృష్టిపెట్టడం లేదు. పదో తరగతి పరీక్షలు జరిగినప్పుడు కూడా ఏ ఒక్క విద్యాశాఖ అధికారి కూడా కనిపించ పోవడం విడ్డూరం. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారిపై మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సుదీర్ఘ పోరాట ఫలితమే 519 జీవో విడుదల

అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటి నాయుడు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గత 10 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆస్తులను అమ్మి బాధితులందరికీ పూర్తి న్యాయం చేస్తామని చెప్పిన ప్రాతిపదికన ఏప్రిల్ 9వ తేదీన జీవో నెంబర్ 519 విడుదల చేస్తూ రాష్ట్ర కమిటీని, జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటుకు ఇచ్చిన జీవోను అగ్రోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవీ నాయుడు అన్నారు. మార్చి 28వ తేదీన సెక్రటేరియట్లో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యకులు ముప్పాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, అధ్యక్షులు ఈ.వి. నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర రావు పాల్గొని అనేక అంశాల మీద చర్చించడం జరిగిందన్నారు. గత మూడు నెలలుగా సిఐడి వారు అగ్రిగోల్డ్ అంశంపైన చేపట్టిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియపరచడం జరిగిందన్నారు. ఈ అంశాలన్నిటిని క్రోడీకరించి బాధితుల ందరికీ పూర్తి న్యాయం చేకూర్చుటకుగాను తీసుకున్న ఈ నిర్ణయాన్ని లక్షలాది మంది బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే క్షేత్రస్థాయిలో అగ్రిగోల్డ్ సంబంధించిన ఆస్తులను గుర్తించి ఎటువంటి చిక్కుముడులులో లేకుండా చిన్న చిన్న కమ తాలుగా విభజన చేసి అగ్రిగోల్డ్ ఖాతాదారులకు బయట నుంచి వేలంలో పాల్గొన్న సంస్థలకు త్వరితగతిన అప్పగించడం ద్వారా బాధితులకు మేలు చేకూర్చడానికి అవకాశం ఉందని ఈ అంశాలను జిల్లా కమిటీలు కొంత సమయాన్ని కేటాయించి పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా బాధితులకు పూర్తి న్యాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంగన్వాడి పోషణ పక్షోత్సవాలు

విశాలాంధ్ర - బలిజిపేట: మండలంలోని అరసాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు 1000 రోజులు (గర్భం దాల్చిన నుంచి బిడ్డకు రెండు సంవత్సరాల వరకు) సంరక్షణ గురించి, తల్లిపాలు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ టాటా ట్రస్ట్ నుంచి జగన్మోహన్ పాల్గొన్నారు.

నిరుపేదలకు బట్టల పంపిణీ

విశాలాంధ్ర - పాలకొండ: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ డిపో ఆవరణలో నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. దివంగత నేత కార్మిక నాయకుడు, శ్రీ కోటదుర్గ మోటార్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకులు, పాలకొండ పంచాయతీ బోర్డు మెంబర్, పాలకొండ ఇలవేల్పు శ్రీ కోటదుర్గమ్మ తల్లి వారి శరన్నవరాత్రి ఉత్సవాల వ్యవస్థాపకులు స్వర్గీయ భాసూరు రామారావు 32వ వర్ధంతి సందర్భంగా రామారావు చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక డిపో మేనేజర్ పి.వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఎంపీటీసీ

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని బిజెపురం ఎంపీటీసీ సభ్యురాలు నాగవరపు మల్లీశ్వరి తన అనుచరులతో ఎంపీపీ బొంగు సురేష్ మండల అధ్యక్షులు పళ్ళ రాంబాబులతో కలిసి నేరుగా గుమ్మలక్ష్మీపురం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా వేసి సాధర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని దివాలా తీసిన రాష్ట్ర పరిస్థితి ఇప్పుడిప్పుడే పుంజుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, సర్పంచులు మండల రమాశంకర్, బొంగు పరిసి నాయుడు, ఎలకల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుండి నేటి వరకు 9సార్లు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు సగానికి సగం తగ్గిపోయినప్పటికీ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లు ప్రజలకు ఉచితంగా ఇస్తామని ఒక ప్రక్క చెబుతూనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రశ్నించకపోవడం విచారకరమని అన్నారు. పెట్రోలియం ఉత్పత్తులైన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం అంటే ప్రజలు కొనే అన్ని నిత్యవసర సరుకులు ధరలు పరోక్షంగా పెంచడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సింహాద్రి దుర్గారావు, నియోజకవర్గ నాయకులు ఈవీ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, మండల కార్యదర్శి బీటి నాయుడు, యువజన విభాగం నాయకులు ఎస్.కిరణ్ కుమార్, చీపురుపల్లి విజయ్, లక్ష్మి, రాజు, కిషోర్ పాల్గొన్నారు.

జిల్లాకు 12 జాతీయ నాణ్యత హామీ ప్రమాణ సర్టిఫికెట్లు

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (సబ్ సెంటర్లు)కు గతంలో ఎప్పుడూ లేనివిధంగా 12 జాతీయ నాణ్యత హామీ ప్రమాణ సర్టిఫికెట్స్ వచ్చే విధంగా కృషిచేసిన వైద్య ఆరోగ్యశాఖ అధికా రులను సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం అభినందించారు. మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్లకు చెందిన కేంద్ర ప్రభుత్వ వైద్య ఉన్నతాధికారులు జిల్లాలోని 15 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో (సబ్ సెంటర్లు) ఉన్న మౌలిక వసతులు, రోగులకు సిబ్బంది అందించే వైద్యసేవలలో నాణ్యతలతో పాటు మందులు పంపిణీ, టీకాలు వేయడం, గర్భిణీలకు ఆరోగ్య పరిరక్షణ తదితర విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గల నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్ సెంటర్ (ఎన్ఎస్ఆర్సి) పరిశీలనలో 12 సబ్ సెంటర్లు ద్వారా సంతృప్తికరమైన సేవలు అందుతున్నట్లు నేషనల్ హెల్త్ రిసోర్స్ సెంటర్ ఉన్నతాధికారులు గుర్తించారు. ఆయా సబ్ సెంటర్లకు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్స్‌ను మంజూరు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డా. రఘుకుమార్, జిల్లా టిబి అధికారి డా. వినోద్ కుమార్, ఉమ్మడి జిల్లా క్వాలిటీ ఎస్యూరెన్స్ అధికారి కె. శ్రీనివాస్, జిల్లా పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ డా. డి. రమణకుమార్ (రఘు) క్వాలిటీ మోని టరింగ్ జిల్లా కన్సల్టెంట్ డా. మణికంత కలెక్టర్‌ను కలిశారు.

బ్యాంకుల చుట్టూ మున్సిపల్ ఉద్యోగుల చక్కర్లు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు గత మూడురోజులుగా పట్టణంలోని బ్యాంకుల చుట్టూ తిరుగుతూ వారి అసలు పనులను గాలికి వదిలేస్తున్న సంఘటన చోటు చేసుకుంది. విషయానికొస్తే పార్వతీపురం మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో 15 సచివాలయాల పరిధిలో అర్హులైన బీసీ కులానికి చెందిన వారు రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బీసీ రుణాలు పొందేందుకు 204 యూనిట్లకు గాను 873 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను బ్యాంకు అధికారుల సమక్షంలో మున్సిపల్ కార్యాలయంలో పరిశీలన చేసే ప్రక్రియ కూడా ముగిసింది. ఇది ఇలా ఉండగా రుణాలను పొందేందుకు దరఖాస్తు దారుడు అర్హత గల పత్రాలను జతపరిచారా లేదా అన్న విషయంతోపాటు సిబిల్ స్కోర్‌లో అర్హత ఉందా లేదా అన్న విషయాన్ని బ్యాంక్ అధికారులు ధ్రువీకరించ వలసి ఉంటుంది. ఈ ప్రక్రియ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న సీఓలు, ఆర్పీలు బ్యాంకు అధికారులతో సమ్మేళనమై పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఈ మున్సిపాలిటీలో గతంలో ఎన్నడూ లేని విధంగా గత మూడు రోజులుగా అర్హుల జాబితాను తెచ్చేందుకు జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి మేనేజర్ స్థాయి ఉద్యోగులు ఇదే పనిపై బ్యాంకుల చుట్టూ తిరగడం గమనార్హం. గురువారం జాబితా తయారు చేసేందుకు చివరి తేదీ కావడంతో మధ్యాహ్నం పన్నెండు గంటలలోపు అన్ని బ్యాంకుల నుండి సిబిల్ బాగున్న వారి పేర్లు బ్యాంకుల నుంచి తీసుకొని మెప్మా సీఓకి అందజేయాలని, ఆ జాబితాను ఆర్పీలు, సీఓ ఎమ్మెల్యే అనుమతితో కూడిన జాబితా తీసుకుని ఓబిఎంఎస్ సైట్ నందు బిసి కార్పొరేషన్ వారి సూచనలు ప్రకారం అప్లోడ్ చేయాలని, ఈ ప్రక్రియ అంతా మధ్యాహ్నం రెండు గంటలలోపు ఎట్టి పరిస్థితుల్లో జరగాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు బోగట్టా. ఇంతవరకు బాగున్నప్పటికీ వ్యక్తిగత రుణాలు పొందేందుకు అర్హులను గుర్తించేందుకు మెప్మా సిబ్బంది పూర్తిస్థాయిలో బాధ్యత వహించాల్సి ఉందని, మున్సిపల్ ఉద్యోగులమైన మేము బ్యాంకుల వద్ద జాబితా కోసం తిరగటం, మేము జాబితాను తెచ్చి అవుట్సోర్సింగ్ ఉద్యోగులైన మెప్మా ఉద్యోగులకు అందజేయడం ఎంతవరకు సమంజసం అన్న విషయం మున్సిపల్ ఉద్యోగులకు మింగుడు పడటం లేదు.

ఈరోజు ఈ విధమైన విధులు నిర్వహిస్తే రాబోయే రోజుల్లో పారిశుధ్య కార్మికులు ధర్నాలు చేస్తే ఆ విధులు కూడా మేము నిర్వహించాల్సి వస్తుందేమోనని వీరు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధి కారులు ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బ తీయ కుండా ఉద్యోగుల స్థాయిని బట్టి పనులు అప్పగిం చాలని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

విద్యా హక్కు చట్టం అమలుపై

అవగాహన లేని డీఈఓ

- జీవో నెంబర్ 9 విడుదలపై లేని స్పష్టత
- ప్రైవేట్ స్కూల్స్ తమకు నచ్చినట్టు ఫీజులు వసూలు చేసుకోవచ్చంటూ వ్యాఖ్యానాలు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 అమలుకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి చిత్రమైన సమాధానం ఇచ్చారు. విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేట్ స్కూల్స్‌లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సిన కోటాపై బాధ్యత రాహిత్యంగా స్పందించారు. ఆ జీవోకు సంబంధించి కోర్టులో స్టేటస్ కో ఉందంటూ సమాచారం చెప్పారు. ఈ అంశమై మరింతగా స్పందిస్తూ జిల్లాలో ఉన్న ప్రైవేట్ స్కూల్స్ తమకు నచ్చిన రీతిలో ఫీజులు వసూలు చేసుకోవచ్చంటూ చెప్పారు. అంతేకాకుండా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేవలం 40 ప్రైవేట్ స్కూల్స్ మాత్రమే ఉన్నాయి అని, అదే విశాఖపట్నం జిల్లాలో అయితే గల్లీ కో ప్రైవేట్ స్కూల్ ఉందని విద్యాశాఖ అధికారి వింత వాదనకు దిగారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి ఒక కీలకమైన అంశంలో జిల్లా విద్యాశాఖ అధికారి కనీసం సమాచారం తెలుసుకోకుండా, నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యానించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.లక్ష 8 వేలకు కాశీపట్నం సంతపాట

విశాలాంధ్ర - అనంతగిరి: మండల ముక ద్వారా పంచాయితీ అయినా కాశీపట్నం సంత ఆశీలు వసూలుకు పంచాయతీ వేలం పాట నిర్వహించింది. గురువారం కాశీపట్నం సర్పంచ్ జనపరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీ సన్యాసిరావు సమక్షంలో పంచాయతీ విస్తరణ అధికారి ధర్మ, కార్యదర్శి రామస్వామి ఆధ్వర్యంలో సంత వేలం పాట నిర్వహించారు. కాశీపట్నం పంచాయతీ దంసరాయి గ్రామ నివాసి మాదల సోనియా రూ.లక్ష 8 వేలకు పాట పాడుకున్నారు. ఈ వేలంపాట నిర్వహించినప్పుడు పంచాయతీలో ఉన్న కో ఆప్షన్ మెంబర్ మదీనా, ఉప సర్పంచ్ రాంబాబు, వార్డ్ నెంబర్స్ బాలమ్మ, ఎర్రిబాబు, సీత, పేష సభ్యులు కంట పైడిరాజు, రాంబాబు గ్రామస్తులు అంగరయ్య, పుష్పానందం, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ఎయిర్‌టెల్ సేవలతో వినియోగదారుల ఇక్కట్లు

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలో బాలరం గ్రామంలో ఉన్న ఎయిర్‌టెల్ టవర్ నుండి సిగ్నల్ లేకపోవడంతో గత వారం రోజుల నుండి ఆరు పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అల్లూరి జిల్లా వైసీపీ సీనియర్ నాయకులు గాడి సత్యనారాయణ, బొడ్డు సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ ఎయిర్టెల్ నెట్వర్క్ బ్యాలెన్స్ వేసుకొని సిగ్నల్ కోసం ఎదురుచూడడం తప్పా తాము ఎవరికి చెప్పాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆరు పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ ప్రాంతాల నుండి ఎదుటివారికి అవతల నుండి మాకు ఎటువంటి సమాచారం రాకపోవడంతో అడవుల్లో ఉన్నామా లేకుంటే గ్రామాల్లో ఉన్నామా తెలియని పరిస్థితి తమకు ప్రస్తుతం ఎదురయ్యిందని వారు అన్నారు ఇప్పటికైనా. సంబంధిత ఎయిర్‌టెల్ సిబ్బంది తక్షణమే స్పందించి ఆరు పంచాయతీల ప్రజలు ఎదుర్కొంటున్న ఎయిర్టెల్ సిగ్నల్ సేవలు పునర్ధించాలని కోరుతున్నారు.

క్లాప్ మిత్రలకు అందని బకాయిలు

విశాలాంధ్ర జీకే వీధి: గూడెం కొత్త వీధి మండలంలో సచివాలయంలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలకు ఐదు నెలల నుండి వేతనలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సచివాలయ క్లాప్ మిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 16 పంచాయితీల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్రలకు ఐదు నెలలు కావస్తున్న మండల పంచాయతీ అధికారులు ఇప్పటికీ జీతాలు చెల్లించలేదని అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకొని, జీతాలు చెల్లించాలని కోరారు. తాము పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ఐదు నెలల వేతనలు చెల్లించాలని, కుటుంబ పోషణ భారం లేకుండా చూడాలని పంచాయతీ క్లాప్ మిత్రులు కోరుతున్నారు.

డ్రైనేజ్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని జి.తాడే పుట్టు పంచాయతీ గడుగు పల్లి గ్రామంలో గల ఎన్‌హెచ్516 జాతీయ రహదారి రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ, వీది దీపాలు మంజూరు చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌కు వినతిపత్రం అందించామని సర్పంచ్ సత్యవతి తెలిపారు. గడుగుపల్లి జాతీయ రహదారి పనులు పరిశీలన నిమిత్తం గురువారం వచ్చిన సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడే పుట్టు గ్రామ పంచాయతీ పరిధిలో గల గడుగు పల్లి గ్రామంలో ఎన్‌హెచ్ 516 జాతీయ రహదారి చిన్నపాటి వర్షం వస్తే నీరు ఎక్కడి కక్కడే నిల్వ ఉండి ప్రజలకు చాలా అసౌక కర్యంగా ఉంటుందని, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ రెండు కిలోమీటర్ల వరకు మూతలతో నిర్మాణం చేపట్టాలని కోరారు. రోడ్డు నిర్మానుష్యం కావడం వలన రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడం వలన కొన్ని కుటుంబాలు వీధిన పడ్డా యని తెలిపారు. ఈ మధ్య కాలంలోనే అధికంగా గడుగుపల్లి గ్రామం పరిసరాలలో ప్రమాదాలు ఎక్కువగా జరిగి మృత్యువాత పడినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ సౌమ్య, లక్ష్మయ్య, వీఆర్వో లక్ష్మి, సర్వేర్ రవీంద్ర, ఉపాధ్యక్షులు నోగేలి సుబ్బారావు, సోమల వెంకన్న, పెసా కమీటి సెక్రెటరీ కిముదు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలి బూడిదైన ఇల్లు

విశాలాంధ్ర - మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం మేజర్ పంచాయతీలో గురువారం ప్రమాదవశాత్తు ఎస్టి కాలనీలో ఓ ఇల్లు కాలి బూడిదైంది. మురళ రమేష్ ఇల్లు ఒక్కసారిగా మంటలు అలుముకొని కాలిపోయింది. ఆ ఇంటితో పాటు కొంచెం దూరంలో ఉన్న పొడియా రాము ఇల్లు కూడా కాలి బూడిదయింది. కాలనీవాసులు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.

ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం

విశాలాంధ్ర - జీకే వీధి: గూడెం కొత్తవీధి మండలంలోని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయంపై వివిధ శాఖల అధికారులను సమన్వయ పరుస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బోయిని కుమారి, మండల రెవెన్యూ తాసిల్దార్ టి.రామకృష్ణ, వ్యవసాయ అధికారి మధుసూదన్ రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పలు సూచనలు చేశారు. ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ గూడెం కొత్తవీధి మండలాన్ని అంతా ప్రకృతి వ్యవసాయపరంగా చేయాలని దీనికి అన్ని శాఖల అధికారులు కూడా సహకరించాలని ఆమె అన్నారు. రైతులు పండించే అన్ని పంటలు ఎక్కువ ఎరువులతో కాకుండా ప్రకృతి సంబంధమైన ఎరువులతో మాత్రమే పండించే దిశగా గూడెం కొత్త వీధి మండలాన్ని తయారు చేయాలని పలువురు అధికారులు వివరించడం జరిగింది. వివిధ శాఖల నుండి అందే పథకాలను రైతులకు ఎలా అంది పుచ్చుకోవాలో అధికారులు వివరించారు. పకృతి వ్యవసాయం ద్వారా పండించినటు వంటి మొక్కజొన్న, సోడ్లు(రాగులు), ధాన్యం, కందులు (పప్పు దినుసులు), బీన్సు, కొర్రలు, సామలు, నల్ల ధాన్యం, పప్పులు దినుసులు పంటలను త్వరగా పండించినటువంటి పంటలు కూడా డిస్ప్లేతో వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయని కుమారి, స్థానిక సర్పంచ్ కే.సుభద్ర, తహశీల్దార్ టి.రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ రావు, ఏపీవో సిహెచ్ రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య విషయాలపై అవగాహన

విశాలాంధ్ర - చింతపల్లి: పోషణ పక్వాడలో భాగంగా గర్భిణీలు, బాలింతలు, శిశువులు, చిన్నారుల ఆరోగ్య విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని జీవీ రమణ అన్నారు. స్థానిక ప్రాజెక్ట్ పరిధిలోని భీమాసింగి సెక్టార్ మామిడిపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. మూడవ రోజైన గురువారం కొత్త పాలెం పంచాయతీ లోని బీమసింగి గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పంచాయతీ సర్పంచ్ వనగల సోమరత్నం, వైస్ ఎంపీపీ గోపీనాయక శారదలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సిడిపిఓ రమణ మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన దగ్గర నుండి శిశువుకు 2సంవత్సరం ల వయసు వచ్చే వరకు మొత్తం 1000రోజులు ఎంత ప్రధానం అయిన రోజులో వివరించారు.

ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఏసిడిపిఓ రామలక్ష్మి, సూపర్వైజర్లు గౌహరున్నీషా, విజయ కుమారి, గౌరీ, అప్పల నరస, అంగన్వాడి కార్యకర్తలు రమణమ్మ, భువనేశ్వరి, పాల్గొన్నారు.

స్థాపితం: 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
రంపచోడవరం, వై.రామవరం, గంగవరం, అడ్డతీగల.
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్యరెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

బాసంగి - పాత నిమ్మలపాడు గ్రామాల మధ్య ఏనుగుల సంచారం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలో గత 15 రోజులుగా ఏనుగుల సంచారం కొనసాగుతూనే ఉంది. గున్న ఏనుగు జన్మించడం వలన నాగావళి నది దాటి కొమరాడ మండలంలో వెళ్లేందుకు అవి సాహసించడం లేదు. గురువారం సాయంత్రం బాసంగి పాత నిమ్మలపాడు గ్రామాల మధ్య నాగవళి నదిలో ఉన్నాయి. అయితే ఏనుగులు ముందులాగే లేవని గున్న ఏనుగు ఉండడం వలన కాస్త అప్రమత్తంగా ఉన్నాయని, దీనిని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఫారెస్ట్ రేంజర్ గంగరాజు ప్రజలను కోరారు.

కాగా అటవీశాఖ సిబ్బంది ట్రాకర్లు ఏనుగుల బారి నుండి ప్రజలను కాపాడేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. అయితే ఏనుగుల భారి నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీలైనంత తొందరగా తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

నేడు పార్వతీపురం, కురుపాంలలో మంత్రి పర్యటన

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం పార్వతీపురం, కురుపాంలలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు కురుపాం మండలం జి. శివడ పంచాయతీ జి. శివడ రహదారి నుంచి రాముడుగూడ వరకు రూ.90 లక్షలతో నిర్మించిన తారు రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రాముడుగుడ నుంచి కీడవాయి వరకు రూ.2 కోట్లతో నిర్మించిన తారు రహదారి ప్రారంభోత్సవం చేస్తారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ముడుపుల పూజలు

విశాలాంధ్ర - సీతానగరం: ఓంనమో శ్రీలక్ష్మినరసింహస్వామినే, జైశ్రీమన్నారాయణ, ఓం నమో శ్రీవేణుగోపాలస్వామినే నమః అంటూ భక్తుల నామస్మరణతో శ్రీలక్ష్మినరసింహ స్వామిఆలయం గురువారంమార్మోగింది. ప్రతీ గురువారం వేలాది మంది భక్తులు వేకువ జాము నుండి సాయంత్రం వరకు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించే ముడుపుల పూజలకు వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలను చేస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసా చార్యులు, పీసపాటి రామానుజా చార్యులు టిటిడి పారాయణ కర్త కె .శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహిస్తున్నారు. భక్తులు తెచ్చిన వివిధరకాల పూలదండలు, పూలు, కొబ్బరికాయలు అరటిపల్లు, కుంకుమ, వసుపుతో స్వామివారి ప్రధానగుడి కళకళలాడుతుంది. ప్రతీ గురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలో జరుగుతున్న ఈ ముడుపుల పూజలకు పాతభక్తులతోపాటు కొత్త భక్తులురాకతో ఆలయం కిటకిటలాడింది. గురువారం జరిగిన ముడుపుల పూజలకు పలువురు జిల్లా, మండల అధికారులు,ఆలయధర్మకర్త చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతిదంపతులు భక్తులు విచ్చేసి పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానఅర్చకులతో పాటు పవన్ ఆచార్యులు, మురారి, మనోజ్ ఆచార్యులు, కృష్ణమోహన్ ఆచార్యులు, దగ్గరుండి పూజలు చేయించడంతోపాటు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసారు.

నారాయణపురంలో అపారిశుధ్యం

విశాలాంధ్ర - బలిజిపేట: నారాయణపురం గ్రామంలో అపారిశుధ్యం తాండవిస్తోందని, కాలువల్లో చెత్తా చెదారాలు పేరుకుపోయాయని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, సిపిఎం పార్టీ నాయకులు దన్నాన త్రినాథ అన్నారు. పంచాయతీ సెక్రెటరీ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. చెత్త తొలగించకపోవడం వల్ల దోమల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, నీటి కొళాయిలకు ట్యాపులు బిగించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు యమ్మల మన్మధరావు, వెంకట్రావు నాయుడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీతారామ స్వామి వసంతోత్సవం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలం లోని రెండవ భద్రాద్రిగా పేరు గాంచిన శ్రీరామగిరి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సుందర సీతారామ చంద్రస్వామి వారి వసంతోత్సవం కన్నుల పండుగగా ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గుట్టపై నుండి శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై మంగళ వాయిద్యాలు నడుమ భక్తజన సందోహం మధ్య ఊరేగిం పుగా శ్రీరామ గిరి గ్రామ పురవీధులలో తీసుకుని వచ్చి కళ్యాణ మండపం వద్ద స్వామివారిని ఆసీనులను చేసి, స్వామివారి వసంతోత్సవ వేడుకను ప్రధాన అర్చకులు పురుషోత్తమాచార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు పెందుర్తి సుదర్శన్ దంపతులు, సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ కే.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం మండలంలోని శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు రామానుజాచార్యులు తెలిపారు. 12వ తేదీన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం, 13వ తేదీన వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 13వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిలరామానుజ జీయర్ స్వామి వారిచే నారశింహష్టకం, ఉపదేశం చేయబడుతుందన్నారు. కావునా భక్తులు యావన్మంది పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగభద్రత కల్పించండి: ఎమ్మెల్యేకు వినతి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : అనేక ఏళ్లగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి కూటమి ప్రభుత్వంలో న్యాయం చేయాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నారు. సంఘ డివిజన్ అధ్యక్షులు అమర్నాథ్ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ల గురువారం ఎమ్మెల్యే విజయ్ చంద్రకు వినతి పత్రం అందజేశారు. 19 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమ వేతనం కింద రూ.26000 అందజేయాలని, మ్యాన్ డేస్ టార్గెట్ ను రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విధానాన్ని రద్దుచేసి అందరిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటనాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

వేటగాళ్ల తూటకు దుప్పి మృతి

విశాలాంధ్ర - వీరఘట్టం: మండలంలోని వండవకొండ సమీపంలో గురువారం ఉదయం అనుమానస్పదంగా ఓ దుప్పి మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దుప్పి మెడపై బుల్లెట్ గాయం ఉన్నట్లు వీర ఘట్టం అటవీశాఖ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిబాబు తెలిపారు. అనంతరం వీరఘట్టం పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య శంకర్ దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. బుల్లెట్ గాయాలు తగిలిన గాయాలు వద్ద మాంసం ముద్దను తొలగించి విశాఖ పట్నం ల్యాబ్‌కు పంపించారు. అనంతరం దుప్పికి అటవీశాఖ అధికారులు దహన సంస్కారాలు నిర్వహించారు.

పూలే, అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే, 14న డా. బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయా తేదీల్లో ఉదయం 9.గం.లకు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు సమర్పణ, అనంతరం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి వేదిక, ఇతర ఏర్పాట్లను మునిసిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల్లో జిల్లా అధికారులతో పాటు ప్రజలు, లబ్ధిదారులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఇందులో బిసి, ఎస్సీ వర్గాలకు చెందిన స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజిలు వంటి మెగా చెక్కుల పంపిణీ ఉండాలని, వీటిని డీఆర్డిఎ, మెప్మా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. బిసి కార్పొరేషన్ ద్వారా ఆదరణ యూనిట్ల పంపిణీ, బిసి, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు, యూనిట్లు పంపిణీని ఆయా అధికారులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణ సంస్థ, వ్యవసాయ, పశు సంవర్థక, విభిన్న ప్రతిభావంతుల శాఖల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. డా. బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున ఆయన చరిత్రను తెలియజేసేలా ఛాయాచిత్ర ప్రదర్శనను ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థల పథక సంచాలకులు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, ఎల్డీఓ రమేష్ రామన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపానికి ఆయుర్వేద చిట్కాలు

ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి సూచనలు

విశాలాంధ్ర - సీతానగరం/బెలగాం : అధిక ఉష్ణోగ్రతల కారణంగా వేసవి తాపానికి గురికాకుండా ఆయుర్వేదంతో ఉపశమనం పొందవచ్చుని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు ఆసుపత్రిలో పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి తనిఖీలు నిర్వహిస్తూ వేసవి జాగ్రత్తలపై గురువారం ఆమె పలు సూచనలు చేశారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందని దీనికి అనుగుణంగా తగు జాగ్రత్తలు తీసుకోని యెడల డీహైడ్రేషన్, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వీటికి గురికాకుండా ఆయుర్వేద ఔషదాలు మరియు ఇంటి వద్దే చేసుకోగలిగే కొన్ని ఆయుర్వేద చిట్కాలతో ఉపశమనాన్ని పొందవచ్చని అన్నారు. సబ్జా గింజలు నానబెట్టి నిమ్మరసం కలిపి అందులో కొంచెం చక్కెర వేసి త్రాగాలన్నారు. మజ్జిగలో జీలకర్ర పొడి చిటికెడు, కొంచెం బ్లాక్ సాల్ట్ వేసి తీసుకోవాలి. వట్టివేరు(ఉశీర) పొడి చేసి అందులో ధనియాలు పొడి కలిపి కషాయం తీసుకోవాలి. శతావరి (పిల్లి పీచర) వేళ్ళు పొడి పాలలో కలిపి తీసుకున్నా ఉపశమనం కలుగుతుందన్నారు. అతి మధుర అర చెంచా గ్లాసులో కలిపి త్రాగాలి. ఉసిరికి పౌడర్ లో గుంటగలగర ఆకు, పెరుగు కలిపి తలకి పట్టించి గంట తర్వాత స్నానం చేయాలి. దోసకాయ రసం ముఖం, చర్మంపై పూతగా వేసుకున్న ఎండకు పొడి బారకుండా ఉంటుందన్నారు. అలాగే ఆయుర్వేద ఔషదాలు, కషాయాలు ముఖ్యంగా దాన్యకపంచక కషాయం, షఢ%శీ%గపానీయం, ద్రాక్షసవలు, దశమూల కషాయాలు వేసవి తాపాన్ని తగ్గిస్తాయన్నారు. వేసవి కాలంలో వచ్చే చర్మ సంబంధిత వ్యాధులకు ఖాదిరారిష్ట, సోమరాజి, మరిచ్యది తైలాలు, విడంగ చూర్ణం ఉపయోగపడతాయన్నారు. ఆహారనియమావళి పాటించాలని శాఖాహారం ఎక్కువగా తీసుకోవాలని, తాజా ఆకుకూరలు, కీర దోస, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, వైద్యుల సూచనలు పాటిస్తూ జాగ్రతలు తీసువాలని డాక్టర్ హేమాక్షి కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మ తదితరులు ఉన్నారు.

ప్రతీ కుటుంబం లక్ష ఆదాయం పొందాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : ప్రతీ కుటుంబం కనీసం లక్ష రూపాయలు ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల నుండి జీవనోపాధి కల్పనలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం కనీసం లక్ష ఆదాయం సంపాదించాలని, ఇందుకు వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక సంబంధిత యూనిట్లు - ఆవుల పెంపకం, మేకల పెంపకం, గొర్రెల పెంపకం, కోళ్ళ పెంపకం తదితర యూనిట్ల ఏర్పాటు వలన పొందే ఆదాయ మార్గాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన అన్నారు. జిల్లాలో 110 ఎకరాల్లో పనస పంట వేయుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. పనస ద్వారా వచ్చే పౌడర్ కు మంచి గిరాకీ ఉందని కలెక్టర్ చెప్పారు. ఒక కుటుంబం లక్ష ఆదాయం పొందుటకు అవసరమగు పెట్టుబడి, వేతనాలు చెల్లింపు, ఇతర ఖర్చులు తదితర అంశాలతో స్పష్టమైన కార్యాచరణ రూపొందించి వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం వలన వారి జీవన ప్రమాణాలు మెరుగుకావాలని అన్నారు. జిల్లాలో లభ్యంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువుల కింద మూడు నుండి నాలుగు వేల ఎకరాల వరకు భూమి అందుబాటులో ఉందని వాటిలో ఉపాధి హామీ కింద కొబ్బరి పంటను వేసి గ్రామ ఐక్య సంఘాలకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. తద్వారా సంఘాలకు ఆదాయం వస్తుందని, భూమి ప్రభుత్వానికి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఐదు ఎకరాలకు కనీసం 3 వందల కొబ్బరి మొక్కలు వేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి యూనిట్ కు అవసరమయ్యే పెట్టుబడి అంశాలను నివేదిక రూపంలో అందించాలని అధికారులను సూచించారు. జిల్లాలో వ్యవసాయ భూమి అందుబాటులో ఉందని, సాగునీటి వసతులు పుష్కలంగా ఉన్నాయని, కష్టించే ప్రజలు ఉన్నారని ఇటువంటి అంశాలను పరిగణలోకి తీసుకొని పెద్ద ఎత్తున జీవనోపాదులు చేపట్టుటకు అవకాశాలు ఉంటాయని చెప్పారు. జిల్లాలో చిరుధాన్యాల పెంపకం సైతం పెద్ద ఎత్తున చేపట్టవచ్చని కలెక్టర్ అన్నారు. జిల్లాలో పంటలు ప్రకృతి సిద్ధంగా పండించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వీటికి మంచి ధర వస్తుందని తెలిపారు. రానున్న రబీ కార్యాచరణ ప్రణాళికలో వీటన్నిటికీ చోటు కల్పించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి డిఎస్. దినేష్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ ఎం. సుధారాణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి. శ్యామల, జిల్లా సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టు అధికారి వి.రాధాకృష్ణ, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్. అశోక్ కుమార్, ప్రకృతి సిద్ధ మొక్కల అనుభవజ్ఞులు టి. శివ కేశవరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలి

లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా డా. చలపతిరావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: లయన్స్ క్లబ్ అభివృద్ధికి మీరంతా సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. గురువారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఎస్.వి.డి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.చలపతిరావును ఎమ్మెల్యే దుస్సాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పనిచేసిన కార్యవర్గాలన్నీ లయన్స్ క్లబ్ అభివృద్ధికి ఎంతో కృషి చేయడం సంతోషకర్మన్నారు. నూతన కార్యవర్గం కూడా వాళ్లను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చేయాలని అన్నారు. లయన్స్ క్లబ్ కు కార్పోరేట్ నిధులను తీసుకొచ్చేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన అధ్యక్షులు డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ పార్వతిపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, పెద్దల, కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలు, అభిప్రాయాలతో, సమిష్టి కృషితో లయన్స్ క్లబ్ ను ఉత్తరాంధ్రలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు తాను కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి. చంద్రశేఖరరావు, డాక్టర్ ద్వారపు రెడ్డి రామ్మోహనరావు, డాక్టర్ యాళ్ళ వివేక్, చుక్క భాస్కరరావు, డాక్టర్ భోగి ఈశ్వరరావు, మంచుపల్లి.శ్రీరాములు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు బి.ఎన్.బి.రావు,పట్టణ ప్రముఖులు టిడిపి నాయకులు లయన్స్ క్లబ్ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

13న మంచిపల్లి సత్యవతి జాతీయ పురస్కార ప్రధానం

విశాలాంధ్ర - పార్వతీపురం: సాహితీ లహరి, మంచిపల్లి సేవా సంస్థ ప్రతీ సంవత్సరం ఇచ్చే మంచిపల్లి సత్యవతి జాతీయ ఉగాది పురస్కార ప్రదానోత్సవం ఈనెల 13వ తేదీ స్థానిక సూర్య పీఠం ఆస్థాన మండపంలో జరుగుతుందని సాహితీ లహరి వ్యవస్థాపకులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు బాల సాహిత్య నిలయం వ్యవస్థాపకులు మంచిపల్లి పార్థసారథిలు తెలిపారు. గత 14 సంవత్సరాలుగా శ్రీమతి మంచిపల్లి సత్యవతి జాతీయ ఉగాది పురస్కారాలు ఇస్తున్నామని శ్రీరాములు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలకు గాను బాల సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు గాను బాల సాహిత్యంలో అనేకకథలు, బాలగేయాలు బాలకవితలువ్రాసి అనేక పుస్తకాలు ప్రచురించి వారి బాల సాహిత్యాన్ని ప్రతీ ఒక్కరికీ చేరవేసినందుకు బెహరా ఉమామహేశ్వరరావు (పార్వతీపురం), దార్లబుజ్జీబాబు (గుంటూరు), అమరావది నీరజా (హైదరాబాద్), ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి (హైదరాబాద్) లకు ఇస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు వివిధ రంగాల్లో సేవ చేసినందుకు గాను సేవాశ్రీ పురస్కారాలు ఈ సంవత్సరం విద్యారంగంలో బి.అగ్నిహెూత్రుడుకు, వైద్యరంగంలో డా:జీరు నగేష్ రెడ్డికు, కళా రంగంలో పల్ల పరిశి నాయుడుకు, సంగీత రంగంలో జమ్మరాజుకు, సామాజిక రంగంలో కె.కృష్ణమూర్తికు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ డి.వి.జి. శంకరరావు (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంస్థ కమిషన్ చైర్మన్), జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ పాల్గొని ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలకు పురస్కార ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించి కవులకు సత్కారం జరుగుతుందని మంచిపల్లి సేవా సంస్థ డైరెక్టర్ మంచిపల్లి పార్థసారథి, డాక్టరు మంచిపల్లి గోపీనాద్‌లు తెలిపారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కురుపాం: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉదయం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు అన్ని చోట్ల వినతిపత్రం అందజేస్తున్నామని దీర్ఘకాలిక సమస్యలు కనీస వేతనం 26000 చేయాలని, క్షేత్ర సహాయకులు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, అందరికీ ఎఫ్ టి.ఈ లుగా చేయాలని వినతిలో కోరారు.

బోదకాలు వ్యాధిగ్రస్తులకు టబ్బులు పంపిణీ

విశాలాంధ్ర - బలిజిపేట: మండలం పెదపెంకి గ్రామంలో ఫైలేరియా వ్యాధితో బాధ పడుతున్న వ్యాధిగ్రస్థులకు మోరబీడీటీ మానేజ్మెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లు జిల్లా మలేరియా ఆఫీస్ నుంచి వచ్చిన సప్లై ఆధారంగా పెదపెంకి గ్రామ ఆరోగ్య మందిరం ఆవరణలో స్థానిక మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జి.నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు వై.రవి కుమార్, సర్పంచ్ పాపారావు, ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. క్రాంతి కిరణ్మయి, స్థానిక టీడీపీ నాయకులు పెంకి మోహనరావు చేతులమీదుగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి డా. క్రాంతి కిరణ్ మయి, పెదపెంకి గ్రామ ప్రజలు వైద్య సిబ్బంది సిహెచ్ఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ పి.ఉమా మహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పిలు సత్యవతి, జ్యోతి, ఏ.ఎన్.ఎం.లు సరోజినీ, గౌరిశ్వరి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - చింతూరు: చింతూరులోని ఐటిడిఎ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు, మన్యం కవి నూనె రమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవల్సిన చర్యలను గురించి నూనె రమేష్ వివరించారు. ఐటిడిఎకి విచ్చేసిన వివిధ మండలాల ప్రజలకు ఉపశమనం కోసం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో పర్యావరణ హితం కొరకు ప్లాస్టిక్ నిర్మూలన చెయ్యాలని పిలుపు నిచ్చారు. ప్లాస్టిక్‌కు బదులుగా జూట్, కాగితం, ఇలాంటివి వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు కట్టా శైలజ, గూడెం హారతి, విద్యార్థులు వేముల చిరంజీవి, గణేష్, మురళి దుర్గ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయంలో భారీ అన్నదానం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి కమ్మరిపేటలో వేంచేసియున్న శ్రీ కోదండ రామలయంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. శ్రీ మలిరెడ్డి ఎంటర్ ప్రైజెస్ అధినేత మలిరెడ్డి గోవింద్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఆధ్యాత్మిక వేత్త, విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు బివివిఎస్ఎన్ గుప్త పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జోగారావు పరామర్శించారు. జమ్మిడివలస మాజీ సర్పంచ్ సూర్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆ కుటుంబాన్ని పరామర్శించి పార్టీ పరంగా సూర్యనారాయణ చిత్తశుద్ధి, క్రమశిక్షణ కలిగిన నాయకుడని అటువంటి సీనియర్ నాయకులను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఆ పార్టీ మండల అధ్యక్షులు రమేష్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల క్యాంపెయిన్

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు నాలుగు బృందాలుగా ఏర్పడి పలు గ్రామాల్లో అడ్మిషన్ల కొరకు వెళ్లడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ జె. రామారావు ఆదేశాల మేరకు పార్వతీపురం మండలం వెంకంపేట, చిన్న బొండపల్లి, ఎంఆర్ నగరం గ్రామాలలో 10వ తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో ఉన్న సదుపాయాలు, వాటి ఆవశ్యకత గూర్చి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. సీనియర్ అధ్యాపకులచే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేశారు. అదే విధంగా ఎంఈఓ ప్రసాద్, సర్పంచ్ టి. కృష్ణారావు లను కలిసి మీ గ్రామాలలో ఉన్న విద్యార్థులను ఇంటర్మీడియట్ పార్వతీపురం ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తెర్లి రవికుమార్, సత్యనారాయణ, కైలాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ బుక్ కాదు.. ఫుడ్ బుక్ రాజ్యాంగం కావాలి

వితంతు ఫింఛన్‌లలో రాజకీయం తగదు...

మాజీ డిప్యూటీ సిఎం రాజన్న దొర

విశాలాంధ్ర:- సాలూరు:-వృద్ధాప్య ఫింఛన్ కోసం పరితపిస్తూ కూర్మ రాజుపేట గ్రామానికి చెందిన వంజరపు అన్నపూర్ణ (62) మృతి చెందటం బాధాకరమని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. వితంతు మహిళలకు ఫింఛన్ అందించడంలో కూడా రాజకీయం చేయడం తగదన్నారు. 15 నెలల క్రితం భర్త చనిపోవడంతో ఫింఛన్‌ను భార్యకు వచ్చేలా నిబంధనలు ఉన్నప్పటికీ నేటికి మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. 2024 నవంబర్, డిసెంబర్ నెలలలో మరణించినవారి యొక్క జీవిత భాగస్వామికి మాత్రమే ఫింఛన్ మంజూరు చేయడం అంతకు ముందు మరణించిన వారి కుటుంబాలను విస్మరించడం శోచనీయమన్నారు. మానవత్వంతో పేద కుటుంబాలను ఆదుకోవాలన్నారు. రాజకీయ కోణంలో చూడటం తగదన్నారు. గత ప్రభుత్వం హయాంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అమ్మఒడి, వైఎస్సాయ్ చేయూత లాంటి పథకాలు పేదలను ఆదుకునేవన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత పేదలకు సంక్షేమ పథకాలు అందకపోవడంతో ఆర్థిక ఆసరా కరువవుతుందన్నారు. గిరిజన మహిళ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం మేజర్ పంచాయతీ పరిదిలోని ప్రదీప్ నగర్ కాలనీ ముందు కల్వర్టు వద్ద శోభలతా దేవి కాలనీ విపరీతంగా చెత్త పెరిగిపోవడంతో కాలనీ ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, ఈఓ వెంకట్ నాయుడు దగ్గరుండి జెసిబితో చెత్తను తొలగించడం జరిగింది.